క్లుప్తంగా

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యే పెద్దారెడ్డికి శ్రీవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తాడిపత్రి అర్బన్: వైకుంఠ ఏకాదశి వేడుకలు విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని చింతల వెంకటరమణస్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు శనివారం సన్మానించారు. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు వేలూరి మురళీప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు, సభ్యులు ఎమ్మెల్యే పెద్దారెడ్డికి శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు. అన్ని విధాలా సహకరించినందుకు ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

హుండీ కానుకల లెక్కింపు



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: మండలంలోని బుగ్గసంగమేశ్వర ఆలయంలో శనివారం భక్తులు స్వామివారికి సమర్పించిన హుండీ కానుకలను లెక్కించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 2 నుంచి డిసెంబర్ 30 వరకూ దాదాపు 10 నెలలకు గానూ రూ.2,28,146, అన్నదానానికి రూ.23,936 నగదును భక్తులు స్వామికి సమర్పించినట్లు ఆలయ ఈఓ కృష్ణయ్య తెలిపారు. దేవాదాయశాఖ ఉరవకొండ తనిఖీ అధికారిణి కే రాణి పర్యవేక్షణలో హుండీ లెక్కింపు సాగింది.

లైఫ్ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోండి

తాడిపత్రి అర్బన్: ప్రభుత్వ పెన్షనర్లందరూ లైఫ్ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని పెన్షనర్ల సంఘం అసోసియేషన్ అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఎస్టీఓ, తహసీల్దార్ కాంపౌండులో ఉన్నటు ఎన్జీఓ హోమ్‌లో జనవరి 2 నుంచి 31వరకు పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు సహకరించనున్నట్లు పేర్కొన్నారు. పెన్షనర్లందరూ వారి బ్యాంకు ఖాతా పాసుపుస్తకాలతో పాటు ఆధార్, పాన్ కార్డు, పీపీఓల జిరాక్స్‌లతో పాటు సెల్‌ఫోన్‌ను వెంట తెచ్చుకోవాలని సూచించారు.

అలరించిన అన్నమాచార్య సంకీర్తనలు

గుంతకల్లు రూరల్: తిమ్మాపురం గ్రామంలో వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం మయూరీ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నమాచార్య సంకీర్తనలు అలరించాయి. రిటైర్డ్ తహసీల్దార్ వెంకటాచలపతి, దివాకర్ శాస్త్రి బృందం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం కళాకారులను అభినందించారు.

అయోధ్య రామయ్య అక్షింతల ఊరేగింపు



యాడికిలో అక్షింతలు ఊరేగిస్తున్న దృశ్యం

యాడికి: అయోధ్య రామయ్య అక్షింతలు శనివారం మండలకేంద్రానికి చేరుకున్నాయి. ఈసందర్భంగా భక్తులు మేళతాళాలతో వాటిని కోన రోడ్డు, తహసీల్దార్ కార్యాలయం, వైఎస్సార్ సర్కిల్ మీదుగా చెన్నకేశవ స్వామి, కోమటి బజార్, బుగ్గ రోడ్డు మీదుగా పోలీస్టేషన్ వరకు ఊరేగించారు. అనంతరం వాటిని స్థానిక చెన్నకేశవ స్వామి ఆలయ ఆవరణలో ఉంచి పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఓపెన్ డిగ్రీ సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించండి

గుంతకల్లుటౌన్: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ 3, 5 సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు జనవరి 17లోగా పరీక్ష ఫీజులను చెల్లించాల్సి ఉంది. ఈమేరకు ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, స్టడీసెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ నాగరాజు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మరింత సమాచారం కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్ఏఓయూఆన్‌లైన్.ఇన్ వెబ్ సైట్ లేదా స్టడీ సెంటర్‌లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని సీపీఐ కాలనీ, కోట వీధిలో శనివారం కుక్కలు దాడిలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. సీపీఐ కాలనీలో నడుచుకుంటూ వెళుతున్న షేక్షావలి అనే యువకున్ని కుక్క వెంట పడి కరిచింది. కోట వీధిలో రాంపుల్లయ్య అనే వ్యక్తిపై కుక్క దాడి చేసి కరిచింది. ఇటీవల కాలంలో కుక్కల బెడద అధికమైందని కుక్కల నియంత్రణనకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

క్రీడల్లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి



తాడిపత్రిలో షటిల్ ఆడుతున్న బాలికలు

గార్లదిన్నె: గ్రామీణ ప్రాంతాల్లో యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఎంపీడీఓ విజయభాస్కర్ పేర్కొన్నారు. శనివారం ఐదో రోజు మండల వ్యాప్తంగా 16 గ్రామ సచివాలయ పరిధిలోని ఆడుదాం ఆంధ్రా పోటీలు జరిగాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తు న్నారన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీయడం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి తెలిపారు. శనివారం చిట్టూరు సచివాలయ పరిధిలో క్రికెట్, మేడిమాకులపల్లిలో వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ , రావులుడికి లో బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

తాడిపత్రి అర్బన్: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మున్సిపల్ కమిషనర్ జి.రవి పేర్కొన్నారు. శనివారం స్థానిక శ్రీవాణి హైస్కూల్‌లో ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా షటిల్ పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ క్రీడలతో శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం క్రికెట్, ఖోఖో, షటిల్, కబడ్డీ పోటీలను నిర్వహించారు.

ఈ–క్రాప్ బుకింగ్ త్వరగా పూర్తి చేయండి

–డీఏఓ ఉమామహేశ్వరమ్మ



మాట్లాడుతున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

గుత్తి రూరల్: రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలకు సంబంధించి ఈ–క్రాప్ బుకింగ్ త్వరగా పూర్తి చేయాలని డీఏఓ ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. శనివారం పట్టణంలోని సీఎల్ఆర్‌సీ భవనంలో గుత్తి డివిజన్‌లోని పామిడి, శింగనమల, గుత్తి, పెద్దవడుగూరు, యాడికి మండలాల వ్యవసాయ సిబ్బంది, రైతు భరోసా కేంద్రాల సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, పురుగుల మందులు, విత్తనాల నమూనాలు సేకరించాలన్నారు. నాణ్యమైన విత్తనాలను ల్యాబ్‌లకు పంపి, దుకాణాల్లో ఎరువులు నకిలీవి అమ్మకుండా నిత్యం తనిఖీలు చేపట్టాలన్నారు. రైతు భరోసా, పీఎం కిసాన్ పథకాల లబ్ధి కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు త్వరగా ఈ–కేవైసీ పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ సిబ్బంది కూడా ఎన్నికల విధులకు వెళ్లాల్సి ఉంటుందని అందుకోసం ఫిబ్రవరి ఆఖరులోపు ఈ–క్రాప్ బుకింగ్, ఈ–కేవైసీ, ఇతర అన్ని రకాల పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ వెంకట్రాముడు, గుత్తి, పామిడి వ్యవసాయాధికారులు ముస్తాక్ అహ్మద్, లీనా వసుంధర, ఎంపీఈఓలు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

గార్లదిన్నె: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై శనివారం రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ప్రాణాపాయం తప్పింది. పోలీసులు తెలిపిన వివరాలు.. అనంతపురం నుంచి గుత్తి వైపు వెళ్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ముందు వెళ్తున్న కంటైనర్‌ను ఢీకొనడంతో అదే సమయంలో వెనుక నుంచి కారును మరో కారును ఢీ కొట్టింది. ప్రమాదంలో ఎవరికీ అపాయం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

టైలరింగ్‌తో స్వయం ఉపాధి



శిక్షణ పూర్తి చేసుకున్న వారితో రోటరీ క్లబ్ సభ్యులు

తాడిపత్రి అర్బన్: టైలరింగ్‌తో స్వయం ఉపాధి లభిస్తుందని వక్తలు పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైలరింగ్ శిక్షణ శనివారం పూర్తయింది. ఈసందర్భంగా 50 మంది మహిళలకు టైలరింగ్ సర్టిఫికెట్‌తో పాటు ఓ కత్తెర, టేపును ఉచితంగా పంపిణీ చేశారు. శిక్షణ పొందిన మహిళలకు పరీక్ష నిర్వహించి మొదటి స్థానంలో నిలిచిన మహిళలకు కుట్టుమిషన్‌ను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శి సుబ్రమణ్యం, ఓకేషనల్ సర్వీస్ డైరెక్టర్ రఫీ, టైలరింగ్ శిక్షకురాలు చంద్రిక, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికడదాం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి

పుట్లూరు: బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలు భాగస్వామ్యం కావాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి కోరారు. శనివారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో బాల్యవివాహాల నియంత్రణపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. వివాహాలు చేసిన తల్లిదండ్రులతో పాటు వివాహం చేసుకున్న వ్యక్తి, అతని తల్లిదండ్రులు, వివాహానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన వారందరూ శిక్షార్హులన్నారు. పుస్తకాలు మోసే వయస్సులో పుస్తెల భారం వద్దని నినాదాలు చేయించారు. అనంతరం ఎస్ఐ దిలీప్‌కుమార్ బాల్యవివాహాలు చేస్తే అమలయ్యే శిక్షలను వివరించారు. అలాగే వాల్‌పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీదేవి, ఈఓఆర్డీ ఆనంద్, హెచ్ఎం ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



రూ.లక్ష అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్: పెద్దపప్పూరులో చింతబరిస్వామి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి రూ.లక్ష విరాళం ప్రకటించారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం పెద్దపప్పూరు, పెద్దవడుగూరు మండలాలకు చెందిన ఆలయ నిర్వాహకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలయ నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే రూ.లక్ష అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డీలర్ జనార్దన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, షేక్‌పల్లి నాగిరెడ్డి, చింతా సుదర్శన్, రామకృష్ణ, కురుబ చిన్నవెంకటనారాయణ, వడ్డే శీన, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు నిర్భయంగా తెలియజేయండి



మహిళలతో మాట్లాడుతున్న ఎస్ఐ శరత్‌చంద్ర

పెద్దపప్పూరు: ఎలాంటి సమస్య వచ్చిన పోలీసులకు నిర్భయంగా తెలియజేయాలని ఎస్ఐ శరత్‌చంద్ర ప్రజలకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో పోలీసు సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయంలో డయల్ 100కు ఫోన్ చేయాలని, 10 నిమిషాల్లో పోలీసులు అందుబాటులో ఉంటారన్నారు.

వైఎస్సార్‌సీపీ కమిటీల నియామకం

గుంతకల్లు: వైఎస్సార్‌సీపీ గుంతకల్లు నియోజకవర్గ మండల, క్లస్టర్ కమిటీలను నియమిస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. వైఎస్సార్‌సీపీ గుంతకల్లు పట్టణాధ్యక్షుడిగా బోయ సుంకప్ప, ఉపాధ్యక్షులుగా ఎస్.నవీన్‌కుమార్, ఉషారాణిని నియమించారు. గుంతకల్లు రూరల్ అధ్యక్షుడిగా బి.మోహన్‌రావు, ఉపాధ్యక్షులుగా తిక్కస్వామి, నగేష్, గుత్తి పట్టణ అధ్యక్షుడిగా డి.హుస్సేన్ పీరా, ఉపాధ్యక్షులుగా వాల్మీకి శివప్రసాద్, హరినాథ్‌రెడ్డి, గుత్తి రూరల్ అధ్యక్షుడిగా గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా విశ్వనాథ్‌రెడ్డి, శ్రీరాములు నియమితులయ్యారు. పామిడి నగర పంచాయితీ అధ్యక్షుడిగా ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా అబుసాలే, శివారెడ్డితో పాటు కోశాధికారులు, కార్యదర్శులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లను నియమించినట్లు ప్రకటనలో వెల్లడించారు.

శింగనమల నియోజకవర్గం

శింగనమల: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శింగనమల నియోజకవర్గంలోని మండల పార్టీ కమిటీలను నియమించారు. బుక్కరాయసముద్రం మండలాధ్యక్షుడిగా బోయ నరేష్, ఉపాధ్యక్షులుగా ఎం.సత్యనారాయణ, జే.నారాయణ, 21 మంది కమిటీ సభ్యులు, గార్లదిన్నె మండలాధ్యక్షుడిగా కే.నరేంద్రనాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా బి.ఎస్. రామాంజినేయులు, జే.రాజన్న నాయుడు, 24 మంది కమిటీ సభ్యులు, నార్పల మండలాధ్యక్షుడిగా ఎస్.రఘునాథరెడ్డి, ఉపాధ్యక్షులుగా బి.పుల్లప్ప, బి.నల్లప్ప, 24 మందిని కమిటీ సభ్యులుగా నియమించారు. పుట్లూరు మండలాధ్యక్షుడిగా ఆర్.నాగేశ్వరావు, ఉపాధ్యక్షులుగా కే.శివజ్యోతి, కే.ఓబిలేసు, 24 మంది కమిటీ సభ్యులు, శింగనమల మండలాధ్యక్షులుగా పట్నం నగేష్, ఉపాధ్యక్షులుడిగా ఈడిగ కృష్ణమోహన్, కె.వేణుగోపాలురెడ్డి, 23 మంది కమిటీ, యల్లనూరు మండలాధ్యక్షుడిగా పి.వెంకటనాయుడు, ఉపాధ్యక్షులుగా వై. భాస్కర్‌నాయుడు, జి.లక్ష్మన్న, 18మందిని కమిటీ సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

తాడిపత్రి నియోజకవర్గం

తాడిపత్రి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ మండల కమిటీలు నియమిస్తూ శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. పెద్దవడుగూరు మండలాధ్యక్షుడిగా వై శరభారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎం రామాంజులరెడ్డి, పడిగిలప్ప, పెద్దపప్పూరు మండలాధ్యక్షుడిగా అమర్‌నాథరెడ్డి, ఉపాధ్యక్షులుగా ప్రకాశం, చిన్నరంగన్న నియమితులయ్యారు. తాడిపత్రి పట్టణాధ్యక్షుడిగా జావీద్‌ఖాద్రీ, ఉపాధ్యక్షులుగా కిరణ్‌కుమార్, బాబా పక్రుద్దీన్, తాడిపత్రి మండలాధ్యక్షుడిగా పల్లె నాగేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షులుగా గురుశంకర్, మాదినేని కృష్ణమోహన్, యాడికి మండలాధ్యక్షుడిగా బొంబాయి రమేష్‌నాయుడు, ఉపాధ్యక్షులేగా వెన్నపూస రామనాగేంద్ర, జేసీ నారాయణరెడ్డితోపాటు ఆయా మండలాల కమిటీలు ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

నైతిక విలువలు పెంపొందించుకోవాలి

అనంతపురం: నైతిక విలువలు పెంపొందించుకోవాలని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన అన్నారు. శనివారం జేఎన్‌టీయూ అనంతపురంలో సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 'మానవీయ విలువలతో కూడిన విద్య' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో మొత్తం 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. డి. భావన (ఈసీఈ విభాగం) మొదటి స్థానం, జెబా కౌసర్ (కెమికల్) రెండో స్థానం, ఎం. జాహ్నవి (కెమికల్ విభాగం మూడో స్థానం దక్కించుకున్నారు. వీరిని వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన , రెక్టార్ ప్రొఫెసర్ విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శశిధర్ అభినందించారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించండి



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని కసాపురం రోడ్డులో ఉన్న భగత్‌సింగ్ కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించాలని అనంతపురం ఎంపీ రంగయ్యను సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు కోరారు. శనివారం ఎంపీ నివాసంలో ఆయనను కలిసిన ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్, తదితరులు వినతిపత్రాన్ని అందజేశారు. కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించాలని రెండేళ్ల నుంచి విన్నవించినా నేటికీ విద్యుత్ స్తంభాలు, తీగలు లాగని కారణంగా పేదలు ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. ఎంపీ నిధుల ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీ హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఎంపీని కలిసిన వారిలో న్యూడెమోక్రసీ నాయకులు దేవేంద్ర, రామాంజినేయులు, జానయ్య, బాష, ప్రతాప్ తదితరులు ఉన్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

గుత్తి: పట్టణంలోని కేపీఎస్ సినిమా థియేటర్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు..కర్నూలు జిల్లా ప్యాపిలికి చెందిన రాముడు పని నిమిత్తం పట్టణానికి బైక్‌పై వచ్చాడు. కేపీఎస్ సినిమా థియేటర్ సమీపంలో వెళ్తుండగా అకస్మాత్తుగా కుక్క అడ్డు రావడంతో బైక్‌ను నియంత్రించుకోలేక కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

పెద్దవడుగూరు : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఈఓపీఆర్‌డి నాగేశ్వరశాస్త్రి సూచించారు. శనివారం మండలంలోని మల్లేనిపల్లి, పెద్దవడుగూరు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సాగింది. ఈ సందర్భంగా వారు కేంద్ర ప్రభుత్వం అందించిన 17 పథకాలను వివరించారు.

ట్రాక్టర్ల పట్టివేత

పామిడి: స్థానిక హనుమాన్ లింకురోడ్డుపై పెన్నానది వైపు వెళ్తున్న రెండు ఖాళీ ఇసుక ట్రాక్టర్లను శనివారం పోలీసులు పట్టుకున్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ రాజశేఖర్‌రెడ్డి హెచ్చరించారు.

న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోండి



మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ గంగయ్య, ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్

తాడిపత్రి అర్బన్: సబ్‌డివిజన్ వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ ఎం.గంగయ్య సూచించారు. శనివారం అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్, రూరల్ అప్‌గ్రేడ్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్ఐ రామకృష్ణతో కలిసి డీఎస్పీ విలేకరులతో మాట్లాడారు. న్యూ ఇయర్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. బార్ అండ్ రెస్టారెంట్లు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే ఉదయం తెరిచి నిర్ణీత సమయంలో బంద్ చేయాలని లేనిపక్షంలో యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువకులు ద్విచక్ర వాహనాల్లో సైలెన్సర్లు తీసి పెద్ద శబ్దంతో ట్రిపుల్ రైడ్ చేస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. 31వ తేదీ సాయంత్రం నుంచే వీధుల్లో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తామని, మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు పాలవుతారని హెచ్చరించారు. మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామన్నారు. తాగిన మైకంలో ఆకతాయిలు మహిళలను వేధిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వేడుకల్లో డీజే, లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దన్నారు. 31వ తేదీ అర్ధరాత్రి 1గంట దాటిన తరువాత రోడ్లపై తిరిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ సాగర్ పేర్కొన్నారు. శనివారం ఎస్ఐ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలు, రోడ్ల మీద న్యూ ఇయర్ వేడుకలు చేయరాదన్నారు. 31వ తేదీ రాత్రి 10 గంటల నుంచి గుంపులు, గుంపులుగా జనం రోడ్ల మీదకు రాకూడదని, ఒకే ప్రదేశంలో ఎక్కువ మంది ఉండకూడదన్నారు. రాత్రి 10 గంటలపైన బార్లు, హోటళ్లు, దాబాలు మూసివేయాలన్నారు.

బధిర విద్యార్థుల ప్రతిభ అమోఘం



ప్రతిభ కనబరిచిన బధిర విద్యార్థులు

బుక్కరాయసముద్రం: బధిర విద్యార్థుల ప్రతిభ అమోఘమని, వారు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఆర్డీటీ మహిళా విభాగం డైరెక్టర్ విశాలా ఫెర్రర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సిద్దరాంపురం రోడ్డు సమీపాన ఉన్న ఆర్డీటీ బధిరుల పాఠశాలలో జిల్లా బధిరుల స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సీనియర్, జూనియన్ సబ్ జూనియర్ బధిరుల క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి విశాలా ఫెర్రర్ హాజరై మాట్లాడారు. దివ్యాంగ విద్యార్థులకు ఆర్డీటీ ఎంతో సహకారం అందిస్తోందన్నారు. బధిరుల విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. అనంతరం ప్రతిభ కనబరిచిన బధిరుల విద్యార్థులను సన్మానించారు. జిల్లా బధిరుల స్పోర్ట్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ సత్యనారాయణరెడ్డి, కృష్ణ, బధిరుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎర్రిస్వామి, దివ్యాంగుల డైరెక్టర్ రఫీక్ పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న ఎంవీఐ రాజాబాబు

గుంతకల్లుటౌన్: మద్యం మత్తులో మితిమీరిన వేగంతో వాహనాలను నడిపి ప్రమాదాలకు గురికావొద్దని మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ రాజాబాబు తెలిపారు. మరలి రాదు ఈ జీవితం అనే నినాదంతో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు ఐడియల్ యూత్ మూవ్‌మెంట్(ఐవైఎం) ఆధ్వర్యంలో ముద్రించిన వాల్‌పోస్టర్లను శనివారం ఎంవీఐ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎంవీఐ, ఐవైఎం స్థానిక నాయకుడు అబ్దుల్ రహిమాన్ మాట్లాడుతూ కొందరు యువత మద్యం, డ్రగ్స్‌కు బానిసలుగా మారి తమ బంగారు భవిష్యత్తును బుగ్గిపాలు చేసుకోవడం బాధాకరమన్నారు. జాతీయ నేర గణాంకాల నివేదిక ప్రకారం మాదక ద్రవ్యాల దుర్వినియోగం, మద్యపాన వ్యసనం వల్ల అనేక ఆత్మహత్యలు నమోదయ్యాయన్నారు. డిసెంబర్ 31 తేదీ రాత్రి మద్యం సేవించి బైక్ డేంజర్ స్టంట్లతో రేసింగ్ చేస్తూ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐవైఎం నాయకులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఘటనపై డీఎస్పీ విచారణ



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటశివారెడ్డి

శింగనమల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ షబ్బీర్ తప్పతాగి మద్యం మత్తులో యువకులు, మహిళపై దుర్భాషలాడిన ఘటనపై శనివారం పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ వెంకటశివారెడ్డి విచారణ చేపట్టారు. శుక్రవారం రాత్రి 8 కానిస్టేబుల్ షబ్బీర్ మఫ్టీలో తప్పతాగి బస్టాండ్ ప్రాంతంలోకి వెళ్లాడు. అక్కడ ఉన్న యువకులు, మహిళలను దుర్భాషలాడాడు. అక్కడి నుంచి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి డ్రస్ వేసుకుని పోలీస్‌స్టేషన్ సమీపంలోని బేకరీ వద్దకు వెళ్లాడు. అక్కడ ఉన్న యువకులు, మహిళను తిట్టాడు. యువకులు, మహిళలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి రాగా అక్కడా వారిని దుర్భాషలాడడమే గాక, రాయితో దాడి చేయడానికి ప్రయత్నించాడు. హెడ్ కానిస్టేబుల్ గిరిప్రసాద్ ఎంత వారించినా కానిస్టేబుల్ వినలేదు. ఘటన మొత్తం సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై స్పందించిన ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సదరు కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేయడంతోపాటు విచారణకు ఆదేశించారు. ఈసందర్భంగా డీఎస్పీ బాధిత యువకులు, మహిళతో వివరాలు సేకరించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని డీఎస్పీ పేర్కొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్, డైరీ విడుదల



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ గురుప్రసాద్

బుక్కరాయసముద్రం: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) క్యాలెండర్, డైరీని శనివారం ఎంఈఓ గురుప్రసాద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ నేతలు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు రమణయ్య, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ గౌస్, పవన్‌కుమార్ అడిట్ కన్వీనర్ సుబ్బరాయుడు, నాయకులు నాగేంద్ర, హెన్రీ, సుంకన్న, నారాయణప్ప, శివప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

అనంతపురం మెడికల్: ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేసి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని ఆరోగ్యశాఖ సిబ్బందిని డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి ఆదేశించారు. శనివారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఎంపీహెచ్ఈఓ, సీహెచ్ఓ అసోసియేషన్లకు చెందిన 2024 క్యాలెండర్లను డీఎంహెచ్ఓ ఆవిష్కరించారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ప్రాణాలకు తెగించి, రోగులకు వైద్య సేవలందించారన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ, సీహెచ్ఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శి మోహన్‌బాబు, రాష్ట్ర సహ అధ్యక్షుడు జే రాజశేఖర్, కోశాధికారి టీ బాలాజీ రావు, సహాధ్యక్షులు జే కళావతి, హేమలత, లోక్‌నాథ్, నాగేశ్వరయ్య, కంబగిరి స్వామి పాల్గొన్నారు.